
సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



అందని లైసెన్సు కార్డులు..
వాహనదారులను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసింది. లైసెన్స్, ఆర్సీ కార్డులు జారీ చేయకుండా చలానా పేరుతో కోట్లు దోచిపెడుతోంది. -10లో



చదువుపై ఆసక్తి తరిగి..
ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహనాయుడు (17 చదువుకోవడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నాడు. -10లో

గరిష్టం/కనిష్టం 34.6/24.6

వాతావరణం
జిల్లాలో గురువారం 24.6 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మోస్తరు వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనంతో జిల్లాలోని ఐదు మండలాల్లో గురువారం స్వల్పంగా వర్షం కురిసింది. ఇందులో భాగంగా గోపవరంలో 0.2 మి.మీ, చాపాడులో 1.6 , బద్వేల్‌లో 1.8 , చక్రాయపేట, జమ్మలమడుగులలో 2.2 మి.ఈమీ వర్షపాతం నమోదైంది.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటీఐలో మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జ్ఞానకుమార్ తెలిపారు. పదో తరగతి పాస్, పెయిల్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన, ఆపై అర్హతలు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. సీటు కోసం అభ్యర్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్, ఫొటో, మెయిల్ ఐడీతో ఐటీఐలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 26లోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఆగస్టు 29న అడ్మిషన్ కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు.

నేటి నుంచి టాయ్ కార్స్ మేళా



కడప కార్పొరేషన్: కడప నగరంలోని నేక్‌నామ్ కళాక్షేత్రంలో ఈ నెల 22, 23, 24 తేదీలలో టాయ్ కార్స్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాహిల్‌తాజ్ తెలిపారు. ఇందులో రూ.3 వేలు, రూ.5వేలు, రూ.7వేలు విలువజేసే కార్లు ఉంటాయని, రూ.35వేలు విలువజేసే కారు కేవలం రూ.20వేలకే విక్రయిస్తామన్నారు. ప్రతి వెయ్యి రూపాయల చెల్లింపునకు ఒక స్క్రాచ్ కార్డు ఇస్తామని, అందులో కనీసం రూ.100ల నుంచి రూ.1000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉన్నాయన్నారు. ఉదాహరణకు రూ.3,500 విలువ చేసే కారు కొంటే మూడు స్క్రాచ్ కార్డులు, రూ.20వేల కారు కొంటే ఇరవై స్క్రాచ్ కార్డులు ఇస్తామని రాహిల్ తాజ్ అన్నారు. ఆయా కార్డులను స్క్రాచ్ చేస్తే ఎంత క్యాష్ బ్యాక్ వస్తే అంతపోను మిగిలిన మొత్తం చెల్లిస్తే సరిపోతుందన్నారు. అరుదుగా లభించే ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు

కడప సెవెన్‌రోడ్స్: మైనార్టీ సంక్షేమశాఖలో 2015 నుంచి జరిగిన నిధుల గోల్‌మాల్‌పై ఆ శాఖ జిల్లా అధికారి హిదాయతుల్లా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారితోపాటు జూనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలీ రూ. 2.48 కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని అభియోగాలు వచ్చాయి. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ విచారణ నిర్వహించారని వెల్లడించారు. నిధుల దుర్వినియోగం విషయం ప్రాథమికంగా రుజువైందని తెలిపారు. నిధులు ఎవరెవరికి అందాయనే పూర్తి సమాచారం సమగ్ర విచారణ ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు. నివేదికను తమ శాఖ ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతి మంజూరు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అదే యాజమాన్యాలలో అంతర్‌జిల్లా బదిలీలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అనుమతి ఇచ్చారని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. 2025 జులై 31 నాటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఈ అంతర్‌జిల్లా బదిలీలకు ఈ నెల 24వ తేదీ వరకు 'లీప్' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అంతర్‌జిల్లా బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు, అవసరమైన ప్రొఫార్మాలు అన్ని వైఎస్సార్ కడప జిల్లా అంతర్జాలం www.kadapadeo.in నందు ఉంచినట్లు డీఈఓ తెలిపారు.

ఎస్సీలకు డ్రైవింగ్‌లో శిక్షణ

కడప రూరల్: ఎస్సీలకు భారీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై, 20 నుంచి 40 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి, హెచ్ఎంవీ కోసం ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని తెలిపారు. హెవీ మోటార్ వెహికల్ ఎల్ఎల్ఆర్ కోసం రూ.210, లైసెన్స్ కోసం రూ.1060 అభ్యర్థులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం అర్హులైన వారిని పదిమందిని ఎంపిక చేసి అందులో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాలను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం, డి బ్లాక్, నూతన కలెక్టరేట్, కడప అనే చిరునామాలో పొందవచ్చు అన్నారు.


కూటమికి మనోవైకల్యం

అంధుల బతుకుల్లో వెలుగులు నింపాల్సింది పోయి.. మరింత ఇక్కట్ల చీకట్లలోకి తోసేసిన రాక్షస ప్రభుత్వమిది.. కాళ్లలో సత్తువ లేక.. నడవడానికి తడబడుతుంటే.. ఊత కర్రలా నిలబడాల్సింది పోయి.. శాతాల పేరిట 'కోత' కోస్తున్న రోత ప్రభుత్వమిది.. విధి రాతనే ఎదిరిస్తూ.. జీవితంలో ఎదురీదుతున్న దివ్యాంగులకు చేయూతనివ్వాల్సింది పోయి.. వారి బతుకుల్ని రోడ్డు పాలు చేస్తున్న మనసు లేని ప్రభుత్వమిది.. పెద్దలకు కోట్ల రూపాయలు అప్పనంగా దోచిపెట్టే కూటమి ముఠా పాలకులు.. పేదల నోటి కాడి కూడుని అమాంతం లాగేస్తూ కర్కశత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒకరా ఇద్దరా.. వేలాది మంది దివ్యాంగుల పింఛన్ల కోత కోసి పొట్టకొట్టారు. పేదల గోడు వినిపించుకోని.. ఈ కూటమి మనో వైకల్య ప్రభుత్వానికి తమ ఉసురు తగులుతుందని దివ్యాంగులు శాపనార్థాలు పెడుతున్నారు.

దివ్యాంగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- పింఛన్ల తొలగింపుతో బోరుమంటున్న దివ్యాంగులు
- మంచంపై ఉన్నవారికీ పింఛన్ల తొలగింపు



పింఛన్లను తొలగించారని వాపోతున్న దివ్యాంగులు



పులివెందుల టౌన్/ ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం పూట గడవని నిరుపేదలపై కక్షగట్టింది. కంటిచూపులేక అవస్థలు పడుతున్న అంధులపై.. కాళ్లలో జీవం లేక మంచానికే పరిమితమైన పోలియో వ్యాధిగ్రస్తులపై కన్నెర్ర చేసింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 'పింఛన్ తీసేశామంటూ' వేలాదిమంది దివ్యాంగులకు నోటీసులిచ్చింది. ఉరుములేని పిడుగులా ఈ కఠిన చేదు వార్త విని దివ్యాంగుల గుండె పగిలింది. మూడు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులకు వరుసగా నోటీసులు అందుతున్నాయి. పింఛన్లపై ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగులు దిక్కుతోచక అధికారుల కాళ్లావేళ్లా పడుతున్నారు. కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంచంపై ఉన్న వారికి కూడా పింఛన్ల తొలగించడంతో దివ్యాంగులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. వికలత్వం శాతం ఎక్కువ ఉన్నా కూడా డాక్టర్లు శాతాన్ని తగ్గించి రిపోర్టులు చూపించడంతో తమ పింఛన్లు తొలగించేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 2.50 లక్షలకు పైగా ఉన్నాయి. అందులో దివ్యాంగుల పింఛన్లు 40 వేలకు పైగా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఈ సంఖ్య కాస్త హెచ్చుతగ్గులుగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 7,182 మందిని అనర్హులుగా గుర్తించారు. వీరందరికీ సదరం క్యాంపుల ద్వారా నిర్ధారణ చేసి, 40 శాతం వికలత్వం తక్కువగా ఉందన్న కారణం చూపి తొలగించారు. తొలగించిన వారికి ఏమైనా అనుమానాలు ఉంటే మళ్లీ అప్పీల్ చేసుకోవచ్చని అందులో పేర్కొన్నారు. ఆ మేరకు నోటీసులు పంపారు.
- మెడికల్ గ్రౌండ్ కింద కొంతమంది నెలకు రూ.15వేల చొప్పున పింఛన్ పొందుతున్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ వైద్య పరీక్షల్లో 408 మందికి ఆరోగ్యం బాగున్నట్లుగా గుర్తించారు. వారందరికీ దివ్యంగుల పింఛన్ కింద ఒక నెలకు రూ.6000 చొప్పున మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు.

రెండు కాళ్లు చచ్చుబడినా..



ఈ దివ్యాంగుని పేరు దొడియ అఫ్జల్. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈయనకు చిన్న తనంలోనే పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. 2010లో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో చెకప్ చేసి 90 శాతం శాశ్వత వికలత్వం ఉందని అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన రీవెరిఫికేషన్ సర్టిఫికెట్‌లో 90 శాతాన్ని 64 శాతానికి తగ్గించారు. పైగా సదరం సర్టిఫికెట్‌లో ఈయన ఫొటోకు బదులు అమ్మాయి ఫొటోను తప్పుగా ముద్రించారు. బీపీ, గుండె జబ్బు, ఆయాసం ఉంది. నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. 'పూర్తి స్థాయి వికలత్వం సర్టిఫికెట్ ఉంటే రూ.15వేలు పింఛన్ ఇవ్వాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం ఇలా పర్సెంటేజీని తగ్గించడం దారుణం' అని వాపోయాడు.

పర్సెంటేజీని తగ్గించడం దారుణం



రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల వికలత్వ శాతాన్ని తగ్గించడం దారుణం. నేను ఎంఏ, బీఈడీ చదువుకుని పోటీ పరీక్షలు రాస్తున్నా. గతంలో 95 శాతం ఉన్న వికలత్వ శాతాన్ని 74 శాతానికి తగ్గించారు. ఈ కారణంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది.
– భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరు

దివ్యాంగులకు తీరని అన్యాయం



ప్రభుత్వ అధికారుల చర్యల కారణంగా దివ్యాంగులకు తీరని అన్యాయం జరుగుతోంది. అర్హత ఉన్నా కొంత మంది మరుగుజ్జులకు దివ్యాంగ పింఛన్లను తొలగించారు. మరికొంత మందికి వికలత్వ శాతాన్ని తగ్గించి పింఛన్‌లో కోత విధించారు. సదరం సర్టిఫికెట్‌లో లబ్ధిదారుల ఫొటోలను కాకుండా ఇతరుల ఫొటోలను ప్రచురించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
–షాకీర్ హుస్సేన్,
అధ్యక్షుడు, ఏపీ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి, ప్రొద్దుటూరు

ఎమ్మెల్యే గారూ...న్యాయం చేయరూ!

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో ఎనిమిది సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి (బాబు)కి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ రూ. 15వేలు రద్దుచేశారు. తన దీన స్థితిని చూసి కూడా ఇలాంటి చర్యలు చేపట్టడం తగదన్నారు. అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ తనకు తగిన న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.



మంచానికే పరిమితమైనా పింఛన్ రద్దు చేశారంటున్న గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

పింఛన్ పైనే ఆధారపడి జీవిస్తున్నా..



నేను చిన్నప్పటి నుంచి పోలియోతో నడవలేని పరిస్థితి. రూ.200ల పింఛన్ నుంచి తీసుకుంటున్నాను. 80శాతం ఉన్న నాకు వైద్యులు పరీక్షించి 40శాతం వికలత్వం ఇవ్వడం బాధాకరం. భర్త లేకపోయినా పింఛన్ డబ్బుతో నా ఇద్దరి బిడ్డలను పోషించుకుంటున్నా.
– దుర్గం హిమాంబి, దివ్యాంగురాలు, పులివెందుల

ఇలా చేస్తే ఎలా..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తానే దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పారు. మేం ఇవ్వమని అడిగామా.. ఉన్న పింఛన్‌ను తొలగించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్న మాకు వైద్య పరీక్షలు చేయకుండానే పింఛన్‌ను తొలగించారు. మా పరిస్థితి ఏంటో మాకు అర్థం కావడంలేదు.
- ఎం.నిజాంబి, దివ్యాంగురాలు, పులివెందుల

పింఛన్ పెంచి తొలగించడమెందుకు..



దివ్యాంగులను ఈ ప్రభుత్వం పింఛన్లను తొలగించి ఎంతో ఇబ్బందులకు గురి చేస్తోంది. పింఛన్ పెంచడమెందుకు.. వాటిని తొలగించడమెందుకు. వికలాంగ పింఛన్ వెరిఫికేషన్‌కు పిలిచి డాక్టర్లు ఏమి చూడకుండానే పంపించారు.
- కృపరాజు, దివ్యాంగుడు, పులివెందుల

పింఛన్ రాకపోవడం బాధగా ఉంది



నేను 2000 సంవత్సరం నుంచి 2025 జులై వరకు పింఛన్ తీసుకున్నాను. కానీ నాకు ఇప్పుడు నువ్వు వికలాంగుని కాదు అని చెప్పి నా పింఛన్‌ను తొలగించారు. నాకు పుట్టుకతోనే పోలియోవల్ల రెండు కాళ్లు సచ్చు బడిపోయాయి. నాకు పింఛన్ రాకపోవడం బాధగా ఉంది.
– చాగలేటి భాస్కర్, దివ్యాంగ పింఛన్‌దారుడు, పులివెందుల

నడవలేని వారి పింఛన్లను కూడా ...



ఈ ఏడాది మార్చి 12న వికలాంగుల వెరిఫికేషన్ కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాం. అక్కడ వైద్యులు అరగంట లోపు ఎవరిని పరీక్షించకుండా 30మంది పత్రాలు తీసుకుని మీకు సచివాలయం ద్వారా మీకు సర్టిఫికెట్ వస్తుందని చెప్పి పంపించారు. ఇప్పుడేమో నోటీసులు ఇచ్చారు.
-జమాల్‌బీ, దివ్యాంగురాలు, పులివెందుల

సేవలు సంతృప్త స్థాయిలో అందాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై గురువారం చీఫ్ సెక్రటరీ విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా సేవలు అందుతున్నాయా? లేదా? అనే విషయమై అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా జరిగేలా చూడాలన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులను సాధించేందుకు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా ఇసుక సేకరణ సాధ్యం కాదని.. ఇప్పటినుంచే అవసరమైన మేర నిల్వలు పెంచుకోవాలని కోరారు. భూగర్భ జల వనరులను పెంపొందించుకోవడంతోపాటు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నింపే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, సీపీఓ హాజరతయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్

పింఛన్లు తొలగించే కుట్ర

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

పోరుమామిళ్ల: దివ్యాంగ పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ హామీని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న పెన్షన్లను తొలగించే పనిలో పడిందని మండిపడ్డారు. తొలివిడతగా దివ్యాంగ, ఆరోగ్య పెన్షన్లపై కన్నేసిందన్నారు. ఇందులో భాగంగానే పది, పదిహేనేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుని, వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని... ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పెన్షన్లను తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిందిపోయి వారి బతుకులతో ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు. వారిపై ఎందుకంత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అప్పుడు అర్హులు ఇప్పుడు అనర్హులా అని ఆయన నిలదీశారు. అప్పటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.200లు పెన్షన్ తీసుకున్న వికలాంగులు ఇప్పుడు అర్హత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు, ఇప్పుడూ రెండుసార్లూ తనిఖీలు చేసింది వైద్యులే కదా, ఇప్పుడు అంగవైకల్యం తగ్గిందని ధృవీకరిస్తున్న ఈ డాక్టర్లది తప్పా లేక అప్పుడు ఇచ్చిన వైద్యులది తప్పా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. వైకల్యశాతం తక్కువ, తాత్కాలిక వైకల్యం కారణంగా పెన్షన్ నిలిపివేయనున్నట్లు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల నుంచి నోటీసులు అందచేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నోటీసులు అందుకున్న వారు అర్హులుగా భావిస్తే తమ వివరాలను ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలలో అప్పీలు చేసుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తుది నిర్ణయం తీసుకుని దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను వాడి వాటిని ప్రోత్సహించాలని, పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యతగా చేయూతను అందిద్దామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సహజ రంగులతో మట్టి విగ్రహాలను తయారు చేయడం స్వచ్ఛతకు ఒక చిహ్నమే గాక ఖర్చుకూడా తగ్గి ఆర్థికంగా కూడా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రజలు వినాయకుని పండుగను పర్యావరణానికి అనుకూలంగా. జరుపుకోవాలని సూచించారు. మన చెరువులు,జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించాలన్నారు. చెరువులు, సరస్సులు జలాశయాలు, జీవరాశుల మనుగడ ముఖ్యమని వాటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, విషపదార్థాల వినియోగం వల్ల జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమలను వినియోగించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.



మట్టి గణపతి విగ్రహాలవాడకంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్, డీవైఎఫ్ఐ నాయకులు

మట్టి గణపతితో పర్యావరణానికి మేలు: జేసీ అదితిసింగ్

వినాయక చవితి పండుగకు మట్టి విగ్రహాలు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఈ అంశంపై డీవైఎఫ్ఐ రూపొందించిన వాల్‌పోస్టర్లను తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వల్ల నీటి కాలుష్యం అధికంగా జరిగే ప్రమాదముందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, వీరనాల శివ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహా, సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి

కడప కార్పొరేషన్: వినాయక చవితి పర్వదిన సందర్భంగా ప్రజలు విద్యుత్ భద్రతా నియమాలను విధిగా పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ కోరారు. గురువారం విద్యుత్ భవన్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక పందిళ్లను విద్యుత్ లైన్లకు సమీపంలో వేయరాదని, దీనివల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. భారీ విగ్రహాలతో ఊరేగింపులు చేసేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే విద్యుత్తు సిబ్బంది సహకారం తీసుకొని విద్యుత్‌ను ఆఫ్ చేయించుకొని ముందుకు సాగాలన్నారు. విద్యుత్ భూతంతో సమానమని చిన్న తప్పిదమే పెను విషాదానికి దారి తీస్తుందని హెచ్చరించారు. వినాయక పందిళ్లకు ఉపయోగించే విద్యుత్ వైర్లను అతుకులు లేకుండా, నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు ఉపయోగించాలన్నారు. విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పందిళ్ల ఏర్పాటు చేయకూడదన్నారు. డెకరేషన్ లైట్లు కట్టుకొనుటకు ఇనుప పైపులు, కడ్డీలు వాడరాదని, కొయ్యలు, ప్లాస్టిక్ పైపులు వాడాలన్నారు. సూచనలు, విద్యుత్ భద్రతా నియమాలను పాటించి వినాయక చవితి ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ

విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన



విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న క్రీడా పాఠశాల సిబ్బంది


కడప వైఎస్ఆర్ సర్కిల్: క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. క్రీడాపాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశానికి అర్హత సాధించిన 19 విద్యార్థులకు 18 మంది, 5వ తరగతిలో 33 మంది విద్యార్థులకు గాను 29 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పలు పత్రాలను పరిశీలించారు. రాష్ట్రంలో క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు రావడంతో క్రీడా పాఠశాల ప్రాంగణం సందడి నెలకొంది. కాగా విద్యార్థుల సర్టిఫికెట్‌లను క్రీడా పాఠశాలలోని కోచ్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు.

అందని లైసెన్సు కార్డులు.. తప్పని అవస్థలు!

రోడ్డెక్కిన వాహనదారులను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు జారీ చేయకుండా చలానా పేరుతో కోట్లు దోపిడీ చేస్తోంది. డిజిటల్ టెక్నాలజీకి తానే ఆద్యుడునని చెప్పుకునే సీఎం చంద్రబాబు తిరిగి ఫిజికల్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనదారులకు కార్డుల భారం లేకుండా డిజిటల్ విధానాన్ని అమలు చేశారు. ఫిజికల్ కార్డు లేకపోయినా యాప్ ఓపెన్ చేసి చూపించినా సరిపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చి దోపిడీకి తెర తీసింది.

- గత ఏడాది నవంబరు నుంచి వాహనదారులకు అందని లైసెన్స్ కార్డులు
- లైసెన్స్ జారీకి ప్రభుత్వ చలనాతోపాటు కార్డుకు రూ. 234 వసూలు
- కార్డులు జారీ చేయకుండా చలానా పేరుతో కోట్లలో దోపిడీ
- డిజిటల్ విధానానికి స్వస్తి పలికిన చంద్రబాబు సర్కార్
- జిల్లా వ్యాప్తంగా 50 వేల వరకు లైసెన్స్, ఆర్సీ కార్డుల పెండింగ్





కడప వైఎస్సార్ సర్కిల్ : డ్రైవింగ్ ఆర్సీ కార్డుల విషయంలో వాహనదారుల పరిస్థితి సంకటంగా మారింది. కార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినా జారీ చేయని పరిస్థితి. రవాణా శాఖలో సేవలు సులభతరం చేశామని కార్యాలయానికి రాకుండా అన్ని సేవలు మీ ముంగిట పొందవచ్చని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం రవాణా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటోంది. వాహనం రోడ్డు ఎక్కితే చాలు లైసెన్స్, ఆర్సీలు చూపించమని అటు రవాణా శాఖ అధికారులు, ఇటు పోలీసు అధికారులు దబాయిస్తున్నారు. కార్డుల కోసం డబ్బులు చెల్లించామని కార్డులు ఇంకా ఇవ్వలేదని చెప్పినా చలానా రాసి చేతిలో పెడుతున్నారు. కొంతమంది వ్యాలెట్ యాప్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న కార్డు చూపితే అది అసలో.. నకిలీనో తమకు తెలియదు కార్డు ఉంటే చూపించు వదిలేస్తామని చెబుతున్నారు.

కార్డుల భారం తగ్గించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

జిల్లా రవాణాశాఖ కార్యాలయంతో పాటు పులివెందుల, బద్వేల్, ప్రొద్దుటూరు పరిధిలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా సగటున 500 పైగా వాహన రిజిస్ట్రేషన్లు పరిమితి లైసెన్సులు జారీ చేస్తుంటారు. ఫిజికల్ కార్డుల కోసం ప్రభుత్వాలు అదనంగా ప్రతి కార్డుకు రూ.235 వసూలు చేసేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనదారులపై కార్డుల భారం తొలగించింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం సెల్‌ఫోన్‌లో వ్యాలెట్ యాప్‌లు అందుబాటులో ఉంచింది. పోలీస్, రవాణాశాఖ అధికారులు అడిగినప్పుడు సేవ్ చేసుకున్న కార్డు చూపితే సరిపోతుంది. పొరపాటున కార్డు మర్చిపోతే వాహన చోదకులపై చలాన్ రాసే పరిస్థితి ఉండడంతో ఈ విధానానికి స్వస్తి పలికింది. డిజిటల్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం వాహనం రోడ్డెక్కితే చాలు పోలీసు, రవాణా శాఖ అధికారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు చూపించమని వేధిస్తున్నారంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్డులకు డబ్బులు చెల్లించి డౌన్‌లోడ్ చేసుకున్న కార్డు చూపితే సరిపోతుందని ప్రభుత్వ మార్గదర్శకాలు ఎక్కడా లేకపోవడంతో ఒరిజినల్ కార్డులు చూపించాలని లేదంటే కేసులు, చలానాలు రాస్తామని చెబుతున్నారు. కొంతమంది అధికారులు వాహనదారులు డౌన్‌లోడ్ చేసుకున్న కార్డులు చూపితే మిన్నకుంటున్నారు. ఎక్కువ మంది అధికారులు జరిమానా విధిస్తుండటంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. కార్డులు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది. కనీసం సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు చూపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే కార్డులను త్వరగా ముద్రించి వాహనదారులకు అందజేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

లైసెన్స్, ఆర్సీ కార్డుకు రూ.235 చెల్లింపు

డిజిటల్ టెక్నాలజీకి తానే ఆద్యుడునని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన డిజిటల్ విధానానికి స్వస్తి పలకడమే కాకుండా వాహనదారులను దోచుకుంటున్నారు. గత ఏడాది నవంబర్ నుంచి మళ్లీ కార్డుల జారీ కోసం ప్రత్యేకంగా డబ్బులు చెల్లించడం ప్రారంభించారు. లైసెన్స్ జారీ రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వ చలానాతో పాటు కార్డుకు ప్రత్యేకంగా రూ.235 వసూలు చేస్తున్నారు. గతే ఏడాది నవంబర్ నుంచి డబ్బులు చెల్లించిన వాహనదారులకు ఇంతవరకు కార్డులు అందలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 50 వేలకు పైగా లైసెన్స్, ఆర్సీ కార్డులు రావాల్సి ఉందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదంతా వాహనదారులను దోపిడీ చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసినట్లు అర్థమవుతోంది. కార్డుల విషయంలో నేటికీ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదు. కార్డుల ముద్రణ రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలా ఏదైనా సంస్థకు అప్పజెప్పాలా అనే సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కార్డులు ఎప్పుడు ముద్రిస్తారో.. మాకు ఎప్పుడు వస్తాయో అంటూ వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

24 నుంచి పెద్దదర్గాలో ఉరుసు ఉత్సవాలు



కడప సెవెన్‌రోడ్స్ : మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ కడప నగరంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న అమీన్‌పీర్ దర్గాలో ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దర్గా ప్రతినిధులు తెలిపారు. దర్గా 10వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24న గంధం, 25న ఉరుసు, 26న తహలీల్ ఫాతెహా ఉంటుందన్నారు. ఉరుసు రోజు ప్రముఖ ఖవ్వాల్ మేరాజ్ వార్సీచే గొప్ప ఖవ్వాలీ కచేరి నిర్వహిస్తామన్నారు.

మోటారు వైర్ల చోరీ

మైదుకూరు : మైదుకూరు శివార్లలో వనిపెంట రోడ్డులో ఉన్న పొలాల్లో వ్యవసాయ మోటారు వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలోని పొలాల వద్దకు సంబంధిత రైతులు గురువారం ఉదయం వెళ్లగా మోటారుకు అమర్చిన స్టార్టర్ వైర్లను కత్తిరించి ఉండటం గమనించారు. దుండగుల పనిగా భావించి రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవలే ఈ ప్రాంతంలో దుండగులు మోటార్ వైర్లను చోరీ చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

క్లుప్తంగా

రైతు ఆత్మహత్యపై ఆర్డీఓ విచారణ



రైతు ఆత్మహత్యపై విచారణ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

దువ్వూరు : మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన రంగాగాళ్ల బుజ్జి అనే కౌలు రైతు గత ఏడాది మే 6న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై గురువారం జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ ఇడమడక గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను విచారించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుకు భార్య, నలుగురు ఆడపిల్లలు, ఒకు కుమారుడు ఉన్నారు. 8 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేయగా నష్టాలు రావడంతో బుజ్జి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆర్డీఓకు తెలిపారు. కూలి నాలి చేసుకుంటూ జీవిస్తున్నామని తమను ఆదుకోవాలని కోరారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి రైతు కుటుంబానికి న్యాయం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, దువ్వూరు తహసీల్దార్ సంజీవరెడ్డి, వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి, ఆర్ఐ జాన్సన్, వీఆర్ఓ హరి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

మైలవరం : మండల పరిధిలోని మాధవాపురం గ్రామానికి చెందిన కొండయ్య(53) అనే రైతు మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. గురువారం తెల్లవారు జామున పని నిమిత్తం మిద్దె ఎక్కి దిగుతుండగా పొరబాటున జారి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కొండయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు.

ఫార్మసీ రంగానిదే ప్రధాన భూమిక



రుక్సానాకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్

రాజంపేట : నేటి సమాజంలో ఫార్మసీ రంగానిదే ప్రధాన భూమిక అని అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. గురువారం జాతీయ స్థాయి సదస్సులో మొదటి బహుమతి సాధించిన రుక్సానా బేగం, అధ్యాపకురాలు సుష్మితను ఆయన అభినందించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఫార్మసీ రంగంలో రాణిస్తే దేశ, విదేశాలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పది రోజులవుతున్నా నా కొడుకు జాడలేదు



మీడియాతో మాట్లాడుతున్న యువకుడి తల్లి రుక్మిణి, బంధువులు

ప్రొద్దుటూరు క్రైం : సుమారు 10 రోజులు అవుతోంది.. ఇంత వరకు నా కుమారుడి జాడ తెలియలేదు.. నీళ్లలో కొట్టుకొని పోతే ఎక్కడో ఒక చోట కనిపించాలి కదా.. ఇన్ని రోజులైనా అతని ఆచూకీ తెలియలేదు.. ముగ్గురు స్నేహితులే నా కుమారుడిని చంపేశారు.. అంటూ బాలుడి తల్లి, బంధువులు రోదిస్తున్నారు. మిట్టమడివీధికి చెందిన నాయుని విక్రం(18) అనే యువకుడు ఈ నెల 12న రామేశ్వరంలోని పెన్నానదిలో గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విక్రం కుటుంబ సభ్యులు గురువారం రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసు అధికారులతో మాట్లాడిన అనంతరం స్టేషన్ బయట వారు గురువారం రాత్రి మీడియా ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడికి నీళ్లంటే భయమని.. అలాంటి వ్యక్తిని ముగ్గురు స్నేహితులు వెంకటసాయి, శివలింగయ్య, మత్తయ్యలు బలవంతంగా పెన్నానదికి తీసుకెళ్లారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు విక్రం నీళ్లలో గల్లంతయ్యాడని, అయితే ముగ్గురు స్నేహితులు మాత్రం సాయంత్రం 6 గంటల సమయంలో పోలీసులకు తెలిపారన్నారు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి ఉంటే పోలీసులు వచ్చి కాపాడేవారని తల్లి రుక్మిణి వాపోయింది. ఒక చెప్పు నీళ్లలో పడిపోతే దాని కోసం విక్రం నీళ్లలో దిగడంతో కొట్టుకొని పోయినట్లు స్నేహితులు చెబున్నారని, అయితే తన కుమారుడి రెండు చెప్పులు బయటనే ఉన్నాయని ఆమె తెలిపారు. చెల్లెలు పరీక్షల్లో ఫెయిల్ కావడంతో విక్రం నీళ్లలో దూకాడని మరొక స్నేహితుడు చెప్పాడన్నారు. విక్రంకు చెల్లెలు లేదని, తనకు ఇద్దరూ కుమారులేనని రుక్మిణి తెలిపింది. అక్కడ జరిగినదానికి, స్నేహితులు చెప్పే మాటలకు పొంతన లేదన్నారు. దీంతో వారిపై అనుమానాలు బలపడుతున్నాయని బంధువులు అంటున్నారు. తన కుమారుడిని వాళ్లే బలవంతంగా తీసుకెళ్లి నీళ్లలో తోసేశారని తల్లి ఆరోపిస్తోంది. పోలీసులు ఇప్పటికైనా లోతుగా దర్యాప్తు జరిపి తన కుమారుడి జాడ కనిపెట్టాలని ఆమె కోరుతోంది.

చదువుపై ఆసక్తి తరిగి.. జీవితంపై విరక్తి కలిగి..

- ట్రిపుల్ ఐటీ విద్యార్థి బలవన్మరణం
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విషాదం
- మృతదేహాన్ని సందర్శించిన పలువురు నాయకులు



విద్యార్థి నరసింహనాయుడు మృతదేహం

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థి గురుగుబిలి నరసింహనాయుడు (17 చదువుకోవడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇడుపులపాయలో ఉన్న ఆర్కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీకాకుళం జిల్లా ఏడ్సల్ మండలం షేర్ మహమ్మదాపురం గ్రామానికి చెందిన అప్పలనాయుడు, రాజులమ్మ దంపతుల కుమారుడు నరసింహనాయుడు ఇడుపులపాయ క్యాంపస్‌లోని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో పీయూసీ–2 (ఇంటర్ ద్వితీయ సంవత్సరం) చదువుతున్నాడు. ఇడుపులపాయ క్యాంపస్‌లోని పాపాఘ్ని వసతి గృహంలో మరో ఐదుగురు విద్యార్థులతో కలిసి హాస్టల్ గదిలో ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున హాస్టల్ గదిలో ఉన్న బాత్రూం కిటికీకి తాడుతో ఉరివేసుకున్నాడు. నరసింహనాయుడు బాత్రూంలో నుంచి ఎంతసేపటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు తలుపులు కొట్టగా పలకకపోవడంతో అనుమానంతో సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమందించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది, ట్రిపుల్ ఐటీ అధికారులు తలుపులు పగలగొట్టి చూడగా కిటికీకి నరసింహనాయుడు వేలాడుతున్నాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

చదువులో మంచి పట్టు..

నరసింహనాయుడుకు చదువులో మంచి పట్టు ఉన్నప్పటికీ మనస్థాపానికి గురయ్యాడు. ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. అయితే విద్యార్థి ట్రిపుల్ ఐటీలో చదవడం ఇష్టం లేనట్లు తెలిసింది. తాను నర్సింగ్ చేయాలని అనుకుంటున్నట్లు తోటి విద్యార్థులతో చెప్పేవాడు. తండ్రి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందగా, తల్లి రాజులమ్మ నర్సుగా పనిచేస్తూ విద్యార్థిని చదివించేది. నరసింహనాయుడు పదవ తరగతిలో 566 మార్కులు సాధించి 2024లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నాడు. అయితే ఆ విద్యార్థికి ట్రిబుల్ ఐటీ చదవడం ఇష్టం లేదు. నర్సింగ్ చేయాలన్నదే తన ఆశయంగా పెట్టుకున్నాడు. ట్రిపుల్ ఐటీలో చదవడం ఇష్టం లేక అప్పుడప్పుడు తోటి విద్యార్థులతో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెబుతుండేవాడని తెలిసింది. విద్యార్థి గత నాలుగు రోజులుగా ముభావంగా ఉండేవాడని తోటి విద్యార్థులు డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విద్యార్థి సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని ఎవరెవరితో చాటింగ్ చేశాడో, ఫోన్ మాట్లాడాడో అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ట్రిపుల్ ఐటీ అధికారులు ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ ఉలసయ్య దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం..

ఇడుపులపాయ క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహ నాయుడు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధకరమని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న నరసింహ నాయుడు మృతదేహాన్ని రాంగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్, సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు, బ్రహ్మయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా వేర్వేరుగా సందర్శించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా మానసికంగా ఇబ్బందులు పడుతుంటే అలాంటి వారికి అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులకు విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



కడప అర్బన్ : వినాయక చవితి పండుగ ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు, ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లాలోని వినాయక ఉత్సవాలకు గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానంలో మాత్రమే అనుమతులు పొందాలన్నారు. కేవలం మట్టి గణపతి విగ్రహాలు మాత్రమే ఉపయోగించాలన్నారు. ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరాలు, అగ్ని ప్రమాద నివారణ సామగ్రి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఊరేగింపుల సమయంలో భక్తి గీతాలు, శాంతి సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు. ఇతర మతస్తుల మనో భావాలను దెబ్బతీయకుండా, సోదరభావంతో, పరస్పర గౌరవంతో ఉత్సవాలు జరపాలని సూచించారు. వివాదాస్పద, మతపరమైన లేదా రాజకీయ ఉద్రిక్తత ఉన్న ప్రదేశాల్లో మంటపాలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఇతరులను రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు, పాటలు, వ్యాఖ్యలు చేయకూడదన్నారు.

కూల్చిన డాబాను పరిశీలించిన బలిజ సంఘం నాయకులు



డాబాను పరిశీలించి మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

దువ్వూరు : మండలంలోని ఇడమడక గ్రామంలో జాతీయ రహదారి సమీపంలో ఉన్న నగరి శ్రీకాంత్ డాబాను సోమవారం ఉదయం రెవెన్యూ, పోలీసు అధికారులు దౌర్జన్యంగా కూల్చివేశారు. విషయం తెలుసుకున్న బలిజ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్, రాయలసీమ అధ్యక్షుడు సమతం రాము గురువారం కూల్చిన డాబాను పరిశీలించారు. అనంతరం శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా శ్రీకాంత్ ఈ డాబాను నిర్వహిస్తున్నాడని, ఏ శాఖకు అభ్యంతరం లేనిది కేవలం అధికార పార్టీ నాయకులకే డాబా అడ్డం వచ్చిందా అని ప్రశ్నించారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

దువ్వూరు : మండలంలోని చిన్నబాకరాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిన్నబాకరాపురం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాసులు(52) తన పొలంలో అరటి పంటకు నీటి తడులు ఇచ్చేందుకు మోటార్ ఆడకపోవడంతో కనెక్షన్ సరిగా లేదని గుర్తించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ వైర్‌ను తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి రెండు ఎకరాల సొంత పొలం ఉండగా, ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి, మొక్క జొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. మృతుడికి భార్య శివమ్మ, కూతురు చందు ఉన్నారు. కూతురుకు ఇటీవలే వివాహం అయింది. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో భార్య శివమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనపై మృతుడి భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

కలెక్టర్ దృష్టికి చియ్యపాడు దళితవాడ పాఠశాల సమస్య



చియ్యపాడు స్కూల్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

చాపాడు : చియ్యపాడు గ్రామంలోని దళితవాడలో గల ఎంపీపీ స్కూల్ సమస్యను జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళతానని జిల్లా విద్యాశాధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. చియ్యపాడు దళితవాడకు చెందిన స్థానికులు, విద్యార్థులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో గురువారం డీఈఓ చియ్యపాడు దళితవాడ పాఠశాలను సందర్శించి ఇక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. వీరి అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.శ్యాంసుందర్‌రెడ్డి, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్ : ప్రభుత్వం అందించే వివిధ పథకాల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. లాప్‌ట్యాప్స్, టచ్ ఫోన్స్, త్రీవీలర్, మోటార్ వెహికల్స్, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు తదితర వాటి కోసం 18 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్ ఉత్తీర్ణత చెందిన వారు అర్హులన్నారు. వీరి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో సంప్రదించాలన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులు డాక్యుమెంట్ల ధ్రువీకరణకు హాజరు కావాలి

కడప అర్బన్ : డిసెంబర్, జనవరి నెలల్లో జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం (డీటీసీ)లో నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో ఎస్సీటీపీసీలుగా తుది రాత పరీక్షలో ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు 25 వ తేదీ సోమవారం, 26వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు సంబంధిత డాక్యుమెంట్లు తీసుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో జతపర్చిన ధ్రువీకరణ పత్రాలు అన్ని ఒరిజినల్ తీసుకుని వాటి పై గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకుని మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకు రావాలన్నారు. ఇటీవల తీయించిన ఆరు పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.


రోడ్డు ప్రమాదంలో నైట్ వాచ్‌మన్ మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం తూర్పుపల్లె దళితవాడకు చెందిన కొండిగారి రామచంద్రయ్య(57) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వండాడి గ్రామ సచివాలయంలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న రామచంద్రయ్య అంగడికి వెళ్తుండగా ద్విచక్రవాహనం రామచంద్రయ్యను ఢీకొంది. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : కడపలో ఏఆర్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న జి శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కడపకు చెందిన ఓ నాయకుడి వద్ద ఆ కానిస్టేబుల్ గన్‌మెన్ గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతని వద్ద ఉన్న 9ఎంఎం పిస్తోలును పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారించిన జిల్లా ఎస్పీ క్రమశిక్షణా రాహిత్యం కింద అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల పదోన్నతులు , సర్వీసు రూల్స్ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డితో కలసి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకీకృత సర్వీసు నిబంధనలు కొన్ని సాంకేతిక కారణాలతో అమలు కాకపోవడం వల్ల దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు దొరకడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. అలాగే 223 జీఓను రద్దు చేసి పాఠశాల సహాయకులకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛను పథకం వర్తింపజేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు.

తల్లి కారు అద్దాలను ధ్వంసం చేసిన కొడుకు



ధ్వంసం అయిన కారు అద్దాలు

ప్రొద్దుటూరు క్రైం : తనకు ఇష్టం లేకున్నా చెల్లెలు పెళ్లి జరిపించిందనే కోపంతో స్వయాన తల్లికి చెందిన కారు అద్దాలను కుమారుడు ధ్వంసం చేశాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. వేంపల్లె మాగెన్నగారి వనిత బంగారు అంగళ్ల వీధిలో నివాసం ఉంటున్నారు. ఆమెకు కుమార్తె లక్ష్మీసౌమినితో పాటు కుమారుడు ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. ఈ ఏడాది మార్చిలో ప్రేమించిన వ్యక్తితో కుమార్తె పెళ్లి జరిపించారు. అయితే ఈ పెళ్లి కుమారుడికి ఇష్టం లేదు. దీంతో తల్లి, కుమారుడి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ కారణంగా కుమారుడు తల్లి నుంచి దూరంగా దొరసానిపల్లెలో నివాసం ఉంటున్నాడు. వనిత మోడంపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కొత్తగా ఇల్లు కడుతోంది. తన టయోటా అర్బన్ క్రూజర్ కారును నిలిపి ఉండగా గురువారం సాయంత్రం తన కుమారుడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు వచ్చి కారు అద్దాలను ధ్వంసం చేశారు. అంతేగాక చంపుతామని వనితను బెదిరించారు. ఈ మేరకు ఆమె రాత్రి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరిలో కాలి బాటలు తీయాలి



వరి నాటుతున్న పొలంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

మైదుకూరు : వరిలో కాలిబాటలు తీయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.చంద్రానాయక్ సూచించారు. ఇండి గ్యాప్ – పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాలెం గ్రామం వద్ద రైతు రంగయ్య పొలంలోకి దిగిన జిల్లా వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడుతూ వరి నాటే సమయంలో కాలిబాటలు తీయడం వల్ల పంటకు గాలి వెలుతురు బాగా అందుతాయని పేర్కొన్నారు. దీని వల్ల చీడపీడలు కూడా సోకకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది బాలయ్య, ఆదినారాయణ, ఎఫ్‌పీఓ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

అనంతరం మైదుకూరులోని శ్రీనివాస్ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తనిఖీ చేశారు. దుకాణంలో ఎరువుల నిల్వలు అమ్మకాల వివరాలున్న రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని రైతులు అవసరమైన మోతాదులో వాడాలని సూచించారు. రైతులు పురుగు మందులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు షాపు యజమానులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.